బీఆర్ఎస్ నాయకుడికి మాజీ మంత్రి పరామర్శ

వసురాంతండాలో మాన్యానాయక్‌ను పరామర్శిస్తున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

ఖిల్లాఘణపురం, అక్టోబర్ 24 : మండలంలోని వసురాంతండాకు చెందిన ఉద్యమకారుడు, బీఆర్ఎస్ నాయకులు మాన్యానాయక్ ఇటీవల ప్రమాదానికి గురైన చికిత్స చేయించుకొని విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి గురువారం మాన్యానాయక్ ఇంటికి వెళ్లి పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని భరోసానిచ్చారు. అదేవిధంగా గ్రామాన్ని నూతన గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేసిన మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేస్తూ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కృష్ణానాయక్, రాళ్లకృష్ణయ్య, సామ్యానాయక్, రంగారెడ్డి, నందిమల్ల అశోక్, బాల్‌రెడ్డి, శరత్, ప్రతాప్, మాజీ సర్పంచ్ గౌడ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పేదింటి ఆడపడుచులకు అండగా ప్రభుత్వం

లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

- ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల, అక్టోబర్ 24 : పేదింటి ఆడపడుచులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి తెలిపారు. జిల్లాకేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో ధరూర్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 139 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను గురువారం ఎమ్మెల్యే పంపిణీ చేశారురు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. చెక్కులను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతు, నాయకులు గట్టుతిమ్మప్ప, బండారి భాస్కర్, గడ్డంకృష్ణారెడ్డి, రామన్‌గౌడ్, సుదర్శన్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, ఆంజనేయులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే ఆల పరామర్శ

జ్యోతి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల

మదనాపురం, అక్టోబర్ 24 : మండలంలోని ఆయా గ్రామాల్లో బాధిత కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి గురువారం పరామర్శించారు. గోవిందహళ్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ కార్యకర్త రాజారెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్నాడు. మాజీ ఎమ్మెల్యే రాజారెడ్డి ఇంటికెళ్లి పరామర్శించి ధైర్యం చెప్పారు. దుప్పల్లి గ్రామానికి చెందిన మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ వెంకట్రాములు తల్లి ఇటీవలే మృతి చెందగా, వెంకట్రాములు కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదే గ్రామానికి చెందిన భరత్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అలాగే అనారోగ్యంతో రాములు అనే కార్యకర్త మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే పరామర్శించారు. తిర్మలాయపల్లి గ్రామానికి చెందిన జ్యోతి అనే విద్యార్థిని ఇటీవలే గుండెపోటుతో మృతిచెందింది. జ్యోతి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతిని వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు బీఆర్ఎస్ తరపున అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. ఆయా కార్యక్రమాల్లో దేవరకద్ర నియోజక వర్గ మహిళా అధ్యక్షురాలు జయంతి, మాజీ జెడ్పీటీసీ కృష్ణయ్య యాదవ్, మార్కెట్ మాజీ చైర్మన్ శ్రావణ్‌కుమార్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు యాదగిరి, యూత్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, మాజీ ప్రధాన కార్యదర్శి తిరుపతయ్య, సీనియర్ నాయకులు కుర్మన్న, కో-ఆప్షన్ సభ్యుడు చాండ్‌పాషా, మాజీ సర్పంచులు శ్రీనివాసులు, విజయేందర్‌రెడ్డి, రాంనారాయణ, శివశంకర్, శారద, ఆంజనేయులు, శ్రావణి, నాయకులు బాలకృష్ణ, కృష్ణ పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలి

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న కలెక్టర్

- కలెక్టర్ సంతోష్

గద్వాల, అక్టోబర్ 24 : ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి వేగవంతంగా పరిష్కరించాలని కలెక్టర్ సంతోష్ అధికారులకు ఆదేశించారు. గద్వాల మున్సిపల్ పరిధి, ఎర్రవల్లిలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో మొబైల్ యాప్ ద్వారా నిర్వహిస్తున్న విధానాన్ని అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాల ప్రకారం ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను సక్రమంగా పరిశీలించి ప్రతి దరఖాస్తు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అధికారులకు ఆదేశించారు. క్షేత్ర సందర్శనలో భాగంగా మొబైల్ యాప్‌ను ఉపయోగించి ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల వివరాలను వారు తెలుసుకున్నారు. లేఅవుట్ పేర్లు, యజమానుల వివరాలు, చదరపు గజాల పరిమాణం, రోడ్డు ప్రభావిత ప్రాంతం వంటి అంశాలు పూర్తిస్థాయిలో నమోదు చేయాలన్నారు. ప్లాట్ ఫొటోలను, ల్యాటిట్యూడ్, నాలుగు వైపులు తీయాలన్నారు. డాక్యుమెంట్ అప్‌లోడ్ విషయంలో లేఅవుట్ సంబంధిత పత్రాలపై పూర్తి జాగ్రత్త వహించాలన్నారు. ప్రభుత్వ భూములు గుర్తిస్తూ భూముల నీటి వనరులు, బఫర్‌జోన్, నాలా చెరువులు, కోర్టు కేసులు విషయాలు పరిశీలించాలని సూచించారు. ప్రతి రోజూ వచ్చిన దరఖాస్తులను పూర్తిచేసి మొబైల్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. మున్సిపల్, గ్రామస్థాయిలో నీటి పారుదల శాఖ పెండింగ్ ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను త్వరగా పూర్తి చేయాలన్నారు. అనంతరం ఎర్రవల్లి మండలంలోని ఎర్రవల్లి, తిమ్మాపూర్ గ్రామాల్లో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. డీపీవో, పంచాయతీ కార్యదర్శులు పెండింగ్ దరఖాస్తులను త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. ఆన్‌లైన్‌లో ఎటువంటి పొరపాట్లు జరగకుండా చూసుకోవాలన్నారు. సంబంధిత దరఖాస్తుదారులకు కాల్ చేసి పెండింగ్ దరఖాస్తులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ దశరథం, డీపీవో శ్యాంసుందర్, ఇరిగేషన్ ఈఈ శ్రీనివాసరావు, టౌన్‌ప్లానింగ్ అధికారి కుర్మన్న తదితరులు పాల్గొన్నారు.

చెరువుల్లో చేపపిల్లలు వదిలిన అధికారులు

రేవల్లి, అక్టోబర్ 24 : ప్రభుత్వం అందించిన చేప పిల్లలను గురువారం మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన చెరువులు, కుంటల్లో అధికారులు, మత్స్య కారులు వదిలారు. నాగపూర్ చెరువులో లక్షా 5వేలు, తల్పునూర్ చెరువులో 36 వేలు, కేశంపేట చెరువులో 30వేలు, ఏదుల చెరువులో 72వేల చేపపిల్లలు వదిలినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో మత్స్యశాఖ అధికారులు వీరేశ్, భరత్ సిబ్బంది రవి, రాజు మండల ముదిరాజు సంఘం అధ్యక్షుడు కాళ్ల కురుమయ్య, కార్యదర్శి సురేశ్, ముదిరాజ్ సంఘం నాయకులు తెప్ప కాశన్న, టప్ప రాజ య్య, పిట్టల బాలయ్య, గోవర్ధన్, వెంకటయ్య, లక్ష్మయ్య పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకున్న కాంగ్రెస్ సర్కారు

- రైతుల సమరభేరీ సదస్సుకు భారీగా తరలిరావాలి
- బీఆర్ఎస్ అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్

గోపాల్‌పేట, అక్టోబర్ 24: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో అమలుకాని హామీలు ఇచ్చి నెరవేర్చలేక ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుందని, పార్టీపై అన్ని వర్గాల ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్ అన్నారు. ఈనెల 29వ తేదీన జిల్లా కేంద్రంలో జరుగనున్న రైతుల సమరభేరీ సదస్సుకు సంబంధించి గురువారం మండలకేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొల్లెద్దుల బాల్‌రాజు అధ్యక్షతన నాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఆయన హాజరై మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు తుంగలోతొక్కి సంక్షేమ పథకాలకు అమలు చేయడం లేదన్నారు. రైతు భరోసా ఇవ్వలేమని లేతులెత్తేయడం సిగ్గు చేటని, రైతులకు పెట్టుబడి సాయం అందించి అండగా ఉండాల్సిన ప్రభుత్వం పెట్టుబడి సాయం ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. రైతులు, ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ వైఖరిపై బాధ్యతగల ప్రతి పక్షంగా రైతులతో కలిసి పోరాడతామన్నారు. ప్రధాన ప్రతి పక్షంగా మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలోనే మొట్టమొదటగా ప్రజల తరపున పోరాడడానికి మాజీ మంత్రి హరీశ్‌రావు వనపర్తిలో జరిగే రైతాంగ ప్రజా నిరసన సదస్సులో పాల్గొంటున్నారని ఆయన తెలిపారు. సభకు పార్టీ శ్రేణులు, రైతులు, ప్రజలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గొర్రెల కాపరుల సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు కురమూర్తి యాదవ్, రైతు బంధు మండల అధ్యక్షుడు తిరుపతి యాదవ్, వైస్ ఎంపీపీ చంద్రశేఖర్, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ హర్యానాయక్, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, వెంకటయ్య ఎంపీటీసీ బాల్‌రెడ్డి, నాయకులు మతీన్, రాజేశ్‌గౌడ్, కాశీనాథ్, జయపాల్‌నాయక్, మన్యం నాయక్, లాలునాయక్, నాగరాజు, రవి, శేషిరెడ్డి, ధర్మయ్య, కృష్ణయ్య, వెంకటయ్యగౌడ్, శివ, యాదగిరి, సురేందర్, మహేశ్, వెంకటేశ్వర్‌రావు, శేఖర్, హనుమంత్ నాయక్, గోపాల్ పాల్గొన్నారు.

గోపాల్‌పేట బీఆర్ఎస్ కార్యాలయంలో నాయకులతో మాట్లాడుతున్న జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్

సన్నరకాలు గుర్తించడంలో అవగాహన ఉండాలి

- కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి టౌన్, అక్టోబర్ 24 : సన్న రకం వరి ధాన్యాన్ని గుర్తించడంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జిలు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. గురువారం నాగవరంలోని రైతువేదికలో పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో పీపీసీ నిర్వాహకులకు సన్న రకం వరి ధాన్యం గుర్తించడంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ సారి ప్రభుత్వం సన్న రకానికి రూ.500 బోనస్ కల్పిస్తున్న నేపథ్యంలో ధాన్యాన్ని గుర్తించడంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతిఒక్కరూ డిజిటల్ గ్రేయిన్ కాలిబర్ మీటర్‌ను తీసుకొని ధాన్యాన్ని గుర్తించడం నేర్చుకోవాలన్నారు. ఏదైనా సెంటర్ నుంచి తప్పుగా ధాన్యాన్ని లోడ్ చేసినట్లు తెలితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

రేషన్ దుకాణం తనిఖీ

జిల్లా కేంద్రంలోని కేడీఆర్ నగర్‌లో ఉన్న 16వ నెంబర్ రేషన్ దుకాణాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. రేషన్ దుకాణంలో సరుకులకు సంబంధించిన రిజిస్టర్లు, బయోమెట్రిక్ సమయానికి లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఈవీఎం గోదాం సాధారణ తనిఖీ

తాసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న ఈవీఎం గోదాంలో కలెక్టర్ సాధారణ తనిఖీ చేశారు. ప్రతి నెల చేసే తనిఖీల్లో భాగంగా అధికారులతో కలిసి పరిశీలించారు. ఈసమావేశంలో పౌర సరఫరాల శాఖ డీఎం ఇర్ఫాన్, డీసీవో ప్రసాదరావు, డీసీఎస్‌వో కాశీ విశ్వనాథ్, డీఆర్డీవో ఉమాదేవి, డీఏవో గోవిందర్‌నాయక్, ఆర్డీవో పద్మావతి, తాసీల్దార్ రమేశ్‌రెడ్డి, ఏఈవోలు, వ్యవసాయ శాఖ సిబ్బంది, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జిలు, ఐకేపీ, మెప్మా సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన ట్రైనీ సివిల్ సర్వీసెస్ అధికారుల పర్యటన

- మండల కేంద్రాల్లోని శాఖల పనితీరుపై పర్యవేక్షణ

మల్దకల్, అక్టోబర్ 24 : మండలంలోని పెద్దతండా, చిన్నతండాతో పాటు మండలకేంద్రంలోని వివిధ శాఖల కార్యాలయాల్లో శాఖల పనితీరును గురువారం ట్రైనీ సివిల్ సర్వీసెస్ అధికారులు వికాస్, పాల్వాయి విష్ణువర్ధన్‌రెడ్డి, ఆదామ్ మొహినుద్దీన్, పుష్కరపరమ, హర్షిత్‌కుమార్, కుమార్ అలావత్ పర్యవేక్షించారు. మూడురోజులుగా ఈ రెండు గ్రామాల్లో పర్యటించి అన్ని శాఖల అధికారులతో శాఖపరమైన అంశాలను అడిగి తెలుసుకున్నారు. ముందుగా ఆదిశిలాక్షేత్రంలో వెలిసిన స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. అనంతరం అర్చకులతో స్వామి వారి చరిత్రను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో చేరుకొని రెవెన్యూ, ఉపాధి అధికారులు, మహిళా సంఘాల పనితీరు, విద్యాభివృద్ధి, పంచాయతీ రాజ్ శాఖతోపాటు తదితర శాఖల పనితీరు అంశాలపై ఆయా శాఖల అధికారులతో చర్చించారు. అలాగే జెడ్పీ పాఠశాలను తనిఖీ చేసి ప్రభుత్వం నుంచి ఎలాంటి సౌకర్యాలు విద్యార్థులకు అందుతున్నాయో అని విద్యార్థులతో ముచ్చటించారు. ఆనంతరం పీహెచ్‌సీ కార్యాలయంలో పర్యటించి రోగులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీసి రికార్డులను పరిశీలించారు. వీరి వెంట ఎంపీడీవో ఆంజనేయరెడ్డి, ఎంపీవో రాజశేఖర్, సీనియర్ అసిస్టెంట్ సూర్యప్రకాశ్‌రెడ్డి, ఎంఈవో సురేశ్, ఏవో రాజశేఖర్ రెడ్డి, మండల వైద్యాధికారిణి డాక్టర్ స్వరూపారాణి, ట్రైపిస్టు రహమాన్, ఏపీవో సుజాత, గ్రామ పంచాయతీ కార్యదర్శులు నర్సింహులు, తిరుమలయ్య, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఇటిక్యాల మండలంలో..

ఇటిక్యాల, అక్టోబర్ 24 : ఉమ్మడి మండలంలో ట్రైనీ సివిల్ సర్వీసెస్ అధికారుల పర్యటన ముగిసింది. నాలుగు రోజుల శిక్షణలో భాగంగా చివరి రోజైన గురువారం మండలకేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల, పీహెచ్‌సీని పరిశీలించారు. ఐకేపీ కార్యాలయంలో మహిళా సంఘాలతో ఇంటరాక్ట్ అయ్యారు. అనంతరం తాసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ప్రభుత్వ పాలనా విధానం, పథకాల అమలు తీరుతెన్నులపై ఆరా తీశారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో తాసీల్దార్ నరేందర్, ఎంపీడీవో మొహినోద్దీన్, పీఆర్ ఏఈ పాండురంగ, విద్యాధికారి అమీర్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

ధరూర్ మండలంలో..

ధరూరు, అక్టోబర్ 24 : మండల కేంద్రంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, రైతువేదిక, సెగ్రిగేషన్ షెడ్‌లను ట్రైనీ సివిల్ సర్వీసెస్ అధికారులు పరిశీలించారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో మంజులతో

ఇటిక్యాలలో మొక్క నాటుతున్న ట్రైనీ అధికారులు

మల్దకల్ ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ట్రైనీ సివిల్ సర్వీసెస్ అధికారులు

సమావేశమై గ్రామీణ పరిస్థితులు, అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణ, నిధులఖర్చు, పంచాయతీ ల అభివృద్ధిపై చర్చించారు. పీహెచ్‌సీలో బెడ్లు, డెలీవరి వార్డు, ఫార్మాసిస్ట్ రూమ్, సిబ్బంది డ్యూటీ రికార్డు, ఓపీ రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ట్రైనీ సివిల్ సర్వీసెస్ అధికారులు సిమ్రాన్ భరద్వాజ్, మనోజ్‌కుమార్ యాదవ్, ఆదర్శ్, దివ్య పెరుమాళ్ల, రిషబ్ జైన్, ఎంపీవో సయ్యద్‌ఖాన్, పంచాయతీ కార్యదర్శి తిరుపతిరెడ్డి, రాధాకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల పరిశీలన

గద్వాల(ఉండవెల్లి), అక్టోబర్ 24 : మండలకేంద్రంలోని వ్యవసాయ, మండల ప్రజా పరిషత్, పంచాయతీ కార్యాలయాలను ట్రైనీ సివిల్ సర్వీస్ అధికారులు గురువారం పరిశీలించారు. ఆయా కార్యాలయాల్లో ఉద్యోగుల విధులు, రికార్డులు, సంక్షేమ పథకాల అమలు, విద్య, వైద్యంపై అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో ట్రైనీ సివిల్ సర్వీస్ అధికారులు లోకేశ్‌కుమార్(ఐఎస్ఎస్), రామకృష్ణ శరణ్ (ఐపీఎస్), ప్రతీక్ గెహ్లోట్ (ఐపీఎస్), అతుల్‌కుమార్ సింగ్ జీఎల్ (ఐఆర్ఎస్ ఐటీ), హిమాన్షు త్యాగి ఏజీఎల్ (ఐఎఫ్‌వోఎస్) తదితరులు పాల్గొన్నారు.

పాలం తగాదాలో కేసు నమోదు

అమరచింత, అక్టోబర్ 24 : అర్ధరాత్రి పొలంలో జేసీబీలతో మట్టిని తవ్వడంతోపాటు పైపులను పగలగొట్టి ఆస్తులను ధ్వంసం చేసిన ఒక వర్గం వారిపై కేసు నమోదు చేశామని అమరచింత ఎస్సై సురేశ్ వెల్లడించారు. మండలంలోని నందిమల్ల గ్రామంలో పన్నెండేండ్లుగా కుమ్మరి ములింద, కుర్వ రంగన్న మధ్య పొలం తగాదా ఉంది. ఈ మధ్య కాలంలో కుమ్మరి ములిందకు కోర్టులో అనుకూలంగా తీర్పు రావడంతో వారు పొలం పనులను చేసుకుంటున్నారు. ఈ క్రమంలో కుర్వ రంగన్న కుటుంబ సభ్యులు పనులను అడ్డుకోవడంతోపాటు మంగళవారం అర్ధరాత్రి జేసీబీతో పొలంలో ఉన్న పైపులైన్‌ను ధ్వంసం చేయడమే కాకుండా బావిని పుడ్చేందుకు మట్టిని పోయడంతో ములింద పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా బుధ వారం ఎస్సై ఘటనా పొలం వద్దకు వెళ్లి విచారణ చేపట్టి పొలం తగాదపై తాసీల్దార్ నివేదిక అందజేస్తామని తెలిపారు. అలాగే అర్ధరాత్రి జేసీబీలతో ఆస్తులను ధ్వంసం చేసిన వారిపై కేసు నమోదు చేస్తామని తెలిపారు.

మహిళ అదృశ్యం : కేసు నమోదు

ఖిల్లాఘణపురం, అక్టోబర్ 24: మహిళ అదృశ్యమైన ఘటన మండలంలోని మామిడిమాడ గ్రామంలో చోటుచేసుకున్నది. ఎస్సై సురేశ్‌గౌడ్ కథనం ప్రకారం మండలంలోని గ్రామానికి చెందిన మంద పద్మ మహబూబ్‌నగర్‌లో విద్యాభ్యాసం చేస్తున్నది. వారం కిందట చదువుకునేందుకు మహబూబ్‌నగర్ వెళ్తున్నానని బంధువులకు చెప్పి వెళ్లి తిరిగి ఇంటికి రాకపోవడంతో బంధువుల ఇండ్లు, తెలిసిన వారి ఇండ్లలో ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో బుధవారం పోలీస్‌స్టేషన్‌లో మంద మల్లమ్మ, పెంటయ్యలు ఫిర్యాదు చేసినట్లు ఎస్సై చెప్పారు. కేసు నమోదు చేసిన దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై చెప్పారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

గోపాల్‌పేట, అక్టోబర్ 24 : అనుమతులు లేకుండా ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకొని కేసునమోదు చేశారు. ఎస్సై నరేశ్‌కుమార్ కథనం మేరకు..మండలకేంద్రానికి చెందిన కొంకల విజయ్ గురువారం ఎలాంటి అనుమతులు లేకుండా వాగు నుంచి ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తుండగా పోలీసులు పట్టుకొని, ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ప్రమాదవశాత్తు పోస్టు ఉమెన్ మృతి

కేటీదొడ్డి, అక్టోబర్ 24 : ప్రమాదవశాత్తు బైక్‌పై నుంచి కిందపడి పోస్టు ఉమెన్ మృతి చెందిన ఘటన మండలం లోని నందిన్నె గ్రామంలో గురువారం చోటు చేసుకున్నది. స్థానికుల కథనం ప్రకారం నందిన్నె పోస్టు ఉమెన్‌గా పని చేస్తున్న సుజాత వేరే వ్యక్తిని తీసుకొని బైక్‌పై గట్టుకు వెళ్లి తిరిగి నందిన్నె గ్రామానికి వస్తున్న క్రమంలో మండలంలోని కుచినేర్ల గ్రామ శివారులో బైక్‌పై వెనక కూర్చున్న మహిళ కింద పడి అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు.

విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

- ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి టౌన్, అక్టోబర్ 24 : విద్యార్థులు చెడు వ్యవసనాలకు దూరంగా ఉంటూ లక్ష్య సాధనకు అనుగుణంగా చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. జిల్లాకేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ విన్నపం మేరకు ఎస్పీ గురువారం కళాశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు తమ లక్ష్య సాధనకు మంచి బుక్స్ చదవడం అలవర్చుకోవాలని, అలాగే మంచి స్నేహితులను కూడా ఎంపిక చేసుకోవడం అవసరం అని అన్నారు. సబ్జెక్టులో వచ్చే తక్కువ మార్కులను చూసి నిరాశ చెందవద్దని, నిరాశ చెందడ వల్ల సమయం వృథా అవడంతోపాటు మానసికంగా బాధను కలుగజేస్తుందన్నారు. విద్యార్థులు రోజు ఫిజికల్ యాక్టివిటీస్ చేయాలని తద్వారా ఫిజికల్‌గా స్ట్రాంగ్‌గా అవుతారని సూచించారు. అదేవిధంగా వాహనం నడిపే వారు హెల్మెట్ పెట్టుకోకపోవడం వంటి చిన్న చిన్న తప్పిదాల వల్ల ప్రతి ఏడాది ఎంతో మంది మరణిస్తున్నారని, రోడ్డు సెఫ్టీ నియమాలు పాటించడం ఎంత అవసరమో విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జగన్‌నాయక్, మెకానికల్ హెచ్‌వోడీ శ్యామ్‌రావు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్పీ రావుల గిరిధర్

కేసీఆర్ కృషి వల్లే వైద్యవిద్యకు ప్రోత్సాహం

పెబ్బేరు, అక్టోబర్ 24 : మాజీ సీఎం కేసీఆర్ కృషి వల్లే ఎంతో మంది పేద విద్యార్థులకు ఎంబీబీఎస్‌లో సీట్లు లభిస్తున్నాయని మున్సిపల్ వైస్‌చైర్మన్ కర్రెస్వామి అన్నారు. పెబ్బేరు పట్టణానికి చెందిన సుగుణ, ఆనంద్‌ల కూతురు శ్రీజ ఎంబీబీఎస్‌లో సీటు సాధించినందుకు గానూ గురువారం ఆమెను బీఆర్ఎస్ నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాములు, నాయకులు సాయినాథ్, వెంకటేశ్, రాజశేఖర్, వీరస్వామి, యాదగిరి, మొగులన్న పాల్గొన్నారు.

పంటల పరిశీలన

ధరూరు, అక్టోబర్ 24 : రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని డీఏవో సక్రియానాయక్ అన్నారు. గురువారం మండలంలోని పొరుచర్ల, మన్నాపురం, గుర్రంపల్లి గ్రామాల్లోని పంట పొలాలను పరిశీలించారు.. అనంతరం మాట్లాడుతూ ఈ నెల 26వ తేదీన జిల్లా కేంద్రంలో నిర్వహించే రైతు సదస్సులో రైతులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో ఆంజనేయులు పాల్గొన్నారు.

పోస్ట్‌మాన్‌ను తొలగించాలి

ధరూరు, అక్టోబర్ 24 : పట్టాదారు పాస్ పుస్తకం పోస్ట్‌లో వస్తే దానిని సంబంధిత వ్యక్తికి ఇవ్వకుండా దాయాదులకు ఇవ్వడంపై వతిరేకిస్తూ పోస్ట్‌మాన్‌ను సస్పెండ్ చేయాలని బాధితుడు డిమాండ్ చేవారు. మండలంలోని రేవులపల్లి గ్రామానికి చెందిన సురేశ్ తన తండ్రి ఎర్రన్నకు ఇద్దరు భార్యలు. సురేశ్ తల్లి సరోజమ్మ మృతిచెందగా రెండో భార్య జయమ్మ ఎర్రన్నకు చెందిన ఆస్తిని మొత్తం ఆమె పేరు మీద చేయించుకున్నది. దీనిపై సురేశ్ తాసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేయగా వాస్తవాలు పరిశీలించిన అధికారులు సురేశ్‌కు రావాల్సిన వాటా భూమిని సురేశ్‌కు వచ్చేలా చేశారు. ఇందుకు సంబంధించిన పాస్ బుక్ పోస్ట్‌లో రాగా పోస్ట్‌మాన్ పాస్‌బుక్‌ను సురేశ్‌కు కాకుండా సవతి తల్లి జయమ్మకు ఇచ్చాడు. ఆమె నుంచి పాస్‌బుక్ తీసుకోవాలంటే మాకు గొడవలవుతున్నాయని దీనికి కారణమైన పోస్ట్‌మాన్ తొలగించి తిరిగి తన పాస్ బుక్ తనకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని గురువారం జిల్లా పోస్ట్ అధికారికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీనిపై పోస్ట్‌మాన్‌ను వివరణ కోరగా నేను నాన్ లోకల్ ఇక్కడ పరిస్థితులు నాకు తెలియవు. పాస్ బుక్ వచ్చిన మాట వాస్తవమే నేను సురేశ్ అనే వ్యక్తికి చాలాసార్లు ఫోన్ చేశాను. ఆయన స్పందించలేదు. ఒకరోజు జయమ్మ వచ్చి పాస్ బుక్ వచ్చాయా సార్ అని అడుగగా ఒక పాస్ బుక్ ఉందని సురేశ్ అనే వ్యక్తిది, ఫోన్ చేస్తే ఎత్తడం లేదని చెప్పాను. దానికి ఆమె నేను సురేశ్ తల్లిని అని చెప్పి తీసుకెళ్లింది. దీనిపై జిల్లా ఆఫీసు నుంచి నాకు నోటీసు వచ్చింది. దీనిని సురేశ్‌కు ఇచ్చి వివరణ తీసుకొని తిరిగి పంపాలని అందులో ఉన్నది. ఇది తీసుకోవడానికి కూడా వాళ్లు రావడంలేదని తెలిపారు.

భారీ కొండచిలువ మృతి

మదనాపురం, అక్టోబర్ 24 : భారీ కొండచిలువ అనుమానాస్పద రీతిలో మృతిచెందిన ఘటన గురువారం రామకిస్టాపురం గ్రామ శివారులో రామన్‌పాడు ఎడమకాల్వ సమీపంలో చోటు చేసుకున్నది. గ్రామస్తులు కథనం ప్రకారం గ్రామానికి చెందిన రైతులు పొలాలకు వెళ్తుండగా కాల్